# 11. ధర్మదేవత

ఇంటిగేటు మూసి మెల్లగా బయటకొచ్చాను. ఆకాశంలో మిణుకు మిణుకు మంటున్న నక్షత్రాలు. చలిగాలి రివ్వుమంటూ చెవుల్లోకి కొడుతోంది. పూర్తిగా తెల్లవారకుండా బయలుదేరానేమో వాకింగ్‌కి. రోడ్డంతా నిర్మానుష్యంగా అనిపించింది. రోజూ నలుగురైదుగురు నడకలో కలుస్తారు. వాళ్ళంతా ఏమైనట్లో!? ఇళ్లలోంచి ఎవరూ బైటికి రావడం లేదు. పక్కనే ఇస్మాయిల్ టీ బంకు. ఈ సమయానికి తాజా తేనీటి వాసన ముక్కుని తాకేది. అసలు టీ బంకే తెరవలేదు. కొంచెం ముందుకు నడిచాను. లారీ ట్రాన్స్‌పోర్టు ఆఫీసు. ఈ సమయంలో శబ్దం చేసుకుంటూ సాగే లారీలు మౌనముద్ర దాల్చిన ఋషుల్లా కనిపించాయి.

మరికాస్త ముందుకు నడిచేసరికి మునిసిపల్ పార్కు, ఒక్కసారి అయోమయంగా అనిపించింది. పార్కులో జనం లేరు. అనుమానం వచ్చి టైము చూసుకున్నాను. ఐదు దాటింది. షటిల్ ఆడేవాళ్లు, ఆసనాలు వేసే వాళ్లు కోతికొమ్మచ్చి ఆడే పిల్లలు ఇలా పార్కు సందడిగా ఉండేది, వాళ్ళంతా ఏమయినట్టు?!

నడక వేగం పెంచాను. పార్కు దాటిన తర్వాత హైవే రోడ్డు. ఒక్కసారి నా నరనరాల్లో ఎక్కువ విద్యుత్తు ప్రవహించి నట్లయ్యింది. హైవేరోడ్డు లేదు. దానికి బదులుగా గోదావరి. ఉరకలు వేస్తూ పరుగులు తీస్తోంది. నాకు తెలియకుండానే నేను గోదావరి పక్కనున్న గట్టు మీద నడుస్తున్నాను. అసలు ఏమయ్యింది? దారి తప్పానా? బహుశా అదే అయి ఉంటుంది. ఆలోచనల్లో పడి గోదావరి వైపు నడక సాగించానేమో!

ఇంతలో 'భౌ' మంటూ కుక్క మొరిగిన శబ్దం వినిపించింది. అమ్మయ్య నర సంచారం లేదనుకున్నాను. కనీసం జంతు సంచారం అయినా ఉందనుకొని, ఆ శబ్దం వచ్చిన వైపు దృష్టి సారించాను.

మళ్లీ ఆశ్చర్యం?

నాకు ఇంచుమించు యాభై అడుగుల దూరంలో గోదారి ఒడ్డున నడుస్తున్న కుక్క, ఆ కుక్క ప్రక్కనే ఒక స్త్రీ. కుక్క, ఆ ఆడమనిషి క్రమ శిక్షణ కలిగిన సైనికులు కవాతు చేస్తున్నటు నడిచి వెళ్లిపోతున్నారు. గోదావరి గట్టుమీద నడవడం నాకు చాలా ఇష్టం. పరవళ్లు తొక్కుతున్న గోదావరిలో తెరచాప పడవలు, పడవ నడిపే సరంగులు పాడే జానపదం వినడం. ఇదంతా గొప్ప అనుభవం. ఆనందంతో నడక ముందుకు సాగించాను. నా ముందు నడుస్తున్న ఆ మహిళ నడక వేగం పెంచింది. కుక్క ఆవిడనే అనుసరిస్తూ పరిగెడుతోంది. నాకు క్షణంలో ఆశ్చర్యం. ఆందోళన.. ఎందుకు ఆవిడ అలా పరిగెడుతోంది? ఇంతకీ ఏం చెయ్యబోతోంది? నరాలు కొరకే ఆ చలిలోనూ చమటలు పట్టాయి. నేనూ పరిగెత్తడం మొదలెట్టాను. ఆవిడ ముఖం నాకు రేఖామాత్రంగా కనిపిస్తోంది. 'ఔను ఆవిడ తెలిసిన మనిషిలాగానే అనిపిస్తోంది.''

''ఆగండి.'' అంటూ అరిచాను ఆవిడ తలతిప్పలేదు. ఒక్క క్షణం గోదారివైపు తిరిగి నిలుచుంది. ఊపిరి పీల్చి వదలింది. చేతులుపైకి చాపింది. రెండు క్షణాల వ్యవధిలో ఆమె కాళ్ళు భూమి నుంచి పైకి లేచాయి.

గట్టు మీద నుంచి పరవళ్లు తొక్కుతూ ప్రవహిస్తున్న గోదావరిలోకి ఆమె దూకేసింది. ఆమెతో పాటు వచ్చిన ఆ కుక్క కూడా గోదాట్లోకి దూకేసింది. యజమానురాలితోపాటూ, ఆమెను అంటిపెట్టుకుని వచ్చిన ఆ మూగజీవీ, తన సంరక్షకురాలు చూపిన తోవే చూసుకుంది. ఏకకాలంలో రెండు ప్రాణుల ఆత్మహత్య. నా సమీపంలో రెండు ప్రాణులు చనిపోతుంటే చూస్తూ అలా నిలుచో బుద్ధి కాలేదు. నేనూ వెంటనే దూకేశాను. దూరంగా తెల్లచీర నీటిలో తేలుతూ, ఆవిడను అనుసరిస్తూ దూకిన కుక్క తల పైకి తేలుతూ

మెల్లగా ఈత కొడుతూ ముందుకు సాగుతున్నాను. ముందుకు వెళ్లే

కొద్దీ ఆ రెండు జీవాలు ముందుకు వెళుతున్నాయి. గోదావరి నడిబొడ్డు కొచ్చాను. 'అయ్యో... చేతులు స్వాధీనంలో లేవు. ఏదో ఊబిలోకి దిగబడి పోతున్నాను. ఎవరో గుండెలమీద కూర్చున్నట్టు. ఊపిరి అడ్డం లేదు. రక్షించుదామని వచ్చి నేనే చావబోతున్నానా!? "రక్షించండి రక్షించండి" గొంతులోని కేక గొంతులోనే సమాధి అయిపోతోంది నాకు.

"ఏంటండీ....

అలా అరుస్తున్నారు...

కల వచ్చిందా....?"

కళ్లు తెరిచాను.

పైన ఫ్యాను తిరగడం లేదు. ఒళ్లంతా చెమటలు. కరెంటు పోయి నట్టుంది. నా శ్రీమతి మాటలతో కళ్లు తెరిచాను.

"ఇదిగో మంచి నీళ్లు తాగండి" గ్లాసు అందించింది శ్రీమతి.

మౌనంగా మంచి నీళ్ళు తాగి ఆలోచనల్లో పడ్డాను. 'అసలు ఈ కల ఎందుకొచ్చినట్టు? కలలోని ఆ ఆడమనిషిని ఎక్కడో చూసినట్టుంది' నాలో ఆలోచనల సుడులు. ముందుకు వెళుతున్న శ్రీమతి వెనక్కి తిరిగి, "అన్నట్టు చెప్పడం మరిచిపోయాను. మన అపార్టుమెంట్ అసోసియేషన్ సెక్రటరీ రాజారావుగారు రెండు సార్లు ఫోన్ చేశారు. మీరు నిద్రపోతున్నారని చెప్పాను. నిన్న రాత్రి ఫోన్ చేశారట కదా. మిమ్మల్ని అర్జంటుగా రమ్మన్నారు. చాలా కోపంగా ఉన్నాడాయన" అంది.

నా శ్రీమతి చెప్పగానే. 'మైగాడ్ అదీ అసలు విషయం. ఇపుడు గుర్తుకొచ్చింది. మత్తు అంతా వదిలిపోయింది. దిగ్గున మంచం మీదనుంచి లేచాను. గబగబా తయారయ్యాను. శ్రీమతి ఇచ్చిన టిఫిన్‌ను వేగంగా నోట్లో కుక్కుకున్నాను.

“ఏమిటీ అంత హడావిడి. ఇంకా ఆఫీసుకు వెళ్లడానికి చాలా టైముంది కదా.” అంది శ్రీమతి.

“లేదు. ముందు మన అపార్ట్‌మెంట్‌కు వెళ్ళి అక్కడ నుంచి మా ఆఫీసుకు బస్సెక్కుతాను” అంటూ బైటకొచ్చి బస్టాపు ముందు నుంచున్నాను.

ఐదు నిమిషాల్లో బస్సొచ్చింది. సీట్లో కూర్చుని “న్యూ కాలనీకి ఒక టిక్కెట్టు” అంటూ కండక్టరుకు డబ్బులిచ్చి ఆలోచనలో పడ్డాను నిన్న అపార్ట్‌మెంటు అసోసియేషన్ సెక్రేటరీ రాజారావు ఫోనులో చెప్పిన విషయాలు మళ్లీ గుర్తుకు తెచ్చుకున్నాను.

“అయ్యా.... మీరు అద్దెకిచ్చిన ఆ ధర్మవతి గారితో మూడేళ్లుగా ఇబ్బందులు పడుతున్నాం. అలగా జనం, ఆ లేబర్ కాలనీ వాళ్లు, అందరినీ ఇంట్లోకి రానిస్తుంది. మీ ఇంట్లోకి చేరినప్పుడే ఒక కుక్కతో వచ్చింది. ఇవన్నీ చాలక, రోడ్డుమీద ఏ పక్షి రెక్క తెగిపడినా, ఏ జంతువుకు దెబ్బలు తగిలినా, వాటన్నింటినీ ఇంటికి తీసుకొచ్చి చికిత్స చేస్తుంది అన్నిటినీ భరిస్తున్నాం.

మొన్న రాత్రి ఏమయ్యింది?! ఆ దిక్కుమాలిన కుక్క నన్నే కరిచింది. ఇప్పుడు ఈ వయసులో నాకు ఎందుకీ బాధ! నాకు ఏమైనా అయితే మీరే జవాబుదారి, ఇప్పుడు వెంటనే ఆవిడను, కుక్కను ఎక్కడో వదిలెయ్యమని చెప్పండి. లేదా ఆవిడయినా ఇళ్ళు ఖాళీ చెయ్యాలి రెండు రోజుల్లో మీరు ఏదో ఒక పరిష్కారం చూపించక పోతే మీ మీదే పోలీసు కేసు పెట్టాల్సి ఉంటుంది.”

రాజారావు మాటలు గుర్తుకొచ్చేసరికి బుర్ర వేడెక్కిపోయింది. అతను చాలా లిటిగెంటు. ‘లా’ చదివాడు ఈ మధ్యనే రిటైరయ్యాడు. అతగాడితో సమస్య వస్తే తల కొరివి తెచ్చుకున్నట్టే?! కరవక కరవక ధర్మవతి గారి కుక్క అతడినే కరవాలా? ఇప్పుడేమిటి దారి?

ఆలోచనలో పడ్డాను మళ్లీ

మూడు సంవత్సరాల క్రితం ధర్మవతి మా ఇంట్లో అద్దెకు దిగడానికి వచ్చినప్పటి విషయం గుర్తుకొచ్చింది.

మా కంపెనీలో పనిచేసే భాస్కరం ఒకసారి ఫోన్ చేశాడు. "నువ్ కంపెనీ క్వార్టరులో ఉంటున్నావ్. నీ స్వంత ఇల్లు ఖాళీ అయిందటకదా.... మా బంధువులావిడకు కావాలి. రేపు వస్తాం. ఆ అపార్టుమెంటు దగ్గరకు రా..." ఇదీ ఆ రోజు భాస్కరం నాకు ఫోనులో చెప్పిన విషయం. ఆ రోజు నేను అపార్టుమెంటుకు చేరుకునే సరికి భాస్కరంతో పాటూ తెల్లగా, పొడుగ్గా ఉన్న ఒక మధ్యవయస్కురాలు కనిపించింది.

"ఈవిడ ధర్మవతి నా కజిన్, ఈవిడకు మీ ఇల్లు కావాలి" అన్నాడు భాస్కరం ఆవిడను పరిచయం చేస్తూ "నాది సింగిల్ బెడ్‌రూమ్ ఇల్లు. ఒక బెడ్‌రూమ్, వంట గది, హాలు మీ ఫ్యామిలీ మొత్తానికి సరిపోదేమో" అన్నాను.

"ఈవిడ ఒక్కరే ఉంటారు..." అన్నాడు భాస్కరం నేను అతడి మాటలకు ఆలోచనలో పడేసరికి, ఆవిడ వెంటనే....

"క్షమించండి నేను మాట్లాడేమాటలు అపార్థం చేసుకోవద్దు. వాస్తవం చెప్పాలి. మా ఆయన్ని ఒదిలేశాను. నా పిల్లలు నన్ను ఒదిలేశారు. ఒంటరి పక్షిని. నాకు తోడుగా ఒక కుక్క.కొన్ని పావురాళ్ళు, చిలకలు, నా తోనూ. ఈ జీవులతోనూ మీకేమీ ఇబ్బంది ఉండదు" అంది. ఆమె నవ్వుతూ.

నేను ఆవిడమాటలకు ఆశ్చర్యంగా చూస్తూ ఉండిపోవడంతో భాస్కరం నన్ను పక్కకు తీసుకెళ్ళాడు "ఆవిడవయసు ఎంత ఉంటుందనుకున్నావ్?" అన్నాడు.

"బహుశా నలభై దాటి ఉంటుంది...."అన్నాను.

కాదు. యాభై మనకన్నా ఐదేళ్ళు చిన్నది. చూశావుగా ఎంత ఆరోగ్యంగా ఆనందంగా ఉందో.. కారణం జీవితాన్ని యథాతథంగా తీసు కుంటుంది.

ఈవిడకు వచ్చినన్ని కష్టాలు బహుశా ఎవరికీ వచ్చి ఉండవేమో! ఇరవయ్యేళ్ళ క్రితం ఈవిడ భర్త పాడేరు గిరిజన వికాస్ కేంద్రంలో ఉన్నతోద్యోగంలో ఉండే వారు. తనతో పని చేసే ఒక అమ్మాయితో అక్రమ సంబంధం పెట్టుకున్నాడు. ఫలితంగా ఆ అమ్మాయికి నెలతప్పింది. విషయం తెలిసి ఈవిడ తన మెడలోని తాళిబొట్టు తీసి భర్త చేత ఆ అమ్మాయి మెడలో కట్టించి భర్తకు రెండోపెళ్ళి తనే స్వయంగా దగ్గరుండి జరిపించింది. ఆ తర్వాత తన ఇద్దరు పిల్లల్ని తీసుకుని బయటకి వచ్చేసింది. తను చిన్నప్పుడు పాసయిన హిందీ పరీక్షల ఆధారంలో హిందీ టీచరు ఉద్యోగం సంపాదించుకుంది. కష్టపడి పిల్లలిద్దరినీ తనే, భర్త సహాయంత ఆశించకుండా చదివించుకుంది. మగపిల్లలిద్దరూ బాగా చదువుకుని తమకు నచ్చిన అమ్మాయిలతో అమెరికాలో స్థిరపడ్డారు. ఇపుడు తల్లిని పూర్తిగా మరిచిపోయారు. తన రెక్కల కష్టంతో పిల్లల్ని ప్రయోజకుల్ని చేసింది. ఇప్పుడా పిల్లలు రెక్కలొచ్చి విదేశాలకు ఎగిరి పోయారు.

అయినా ధర్మవతి గుండె నిబ్బరంతో ఒంటరిగా బతుకుతోంది. ఈ ఊళ్ళో కాలేజ్‌లో ఆమెకు హిందీ లెక్చరరుగా పదోన్నతి. అందుకే ఈ ఊళ్ళో ఆవిడకు నీ ఇల్లు కావలసి వచ్చింది. ఒక్కర్తే కదా మా ఇంట్లో ఉండమన్నాం. అయినా ఒప్పుకోలేదు. మీ సింగిల్ బెడ్‌రూమ్ ఆవిడకు సరిపోతుంది.''

అలా మూడు సంవత్సరాల క్రితం భాస్కరం ఆవిడ గురించి నాకు వివరంగా చెప్పి మా ఇంట్లో అద్దెకు కుదిర్చాడు. మూడుళ్ళుగా ఆవిడతో ఏ ఇబ్బందీ రాలేదు. అసోసియేషన్ సమావేశాల్లో కొన్ని ఫిర్యాదులు వచ్చేవి.

రోజూ రాత్రిళ్ళు ఆవిడ కుక్క మొరుగుతోందని ఒకరంటే, ఫరవాలేదు. మనకు భద్రత, రాత్రిళ్లు దొంగల భయం ఉండదు అని వేరే వారు సర్ది చెప్పేవారు. ఆవిడ పక్షుల్నీ చిలకల్నీ పెంచుతుంది. అవి చేసే చప్పుళ్లు ఇబ్బంది కలిగిస్తాయి. అని ఒకరు మాటవిసిరితే. ఈ కాంక్రీట్ జంగిల్‌లో పక్షుల కిల

కిల రావాలు, చిలకల పలుకులు ఆవిడ ద్వారా వింటున్నాం. అది ఇబ్బంది కాదు. మన చెవులకు ఇంపైన సంగీతం అని వేరేవారు కొట్టి పారేసేవారు. ఇలా ధర్మవతి గురించిన మిశ్రమ స్పందనలతో మూడేళ్లు గడిచిపోయాయి. అయితే మొన్న రాత్రి రాజారావుగారిని ధర్మవతిగారి పెంపుడు కుక్క కరవడంతో సమస్య జటిలమయింది. అదే ఆలోచనలతో కాస్త భయంగానే నేను నిన్న రాత్రి నిద్రపోవడం... ఫలితంగా ఈ కల.. కలలో కనిపించిన ఆవిడ ధర్మవతి.

అందుకే, ఆందోళనగా ఇక్కడికి భయపడుతూనే వచ్చాను. బస్సు స్టాపులో ఆగగానే వెంటనే దిగి పరుగులాంటి నడకతో అపార్టుమెంటుకు చేరుకున్నాను. సెల్లార్‌లో ఉన్న మా ఇంటి తలుపు కొట్టగానే భౌ భౌ మంటూ కుక్కమొరిగిన శబ్దం వినిపించింది. తలుపు తెరుచుకుంది. ధర్మవతి 'నమస్కారం సార్' అంటూ రెండు చేతులూ జోడించింది.

నల్లగా బొద్దుగా ఉన్న ఐదేళ్ళ అమ్మాయి, తల టవల్‌తో తుడుస్తోంది.

''ఇది నా పనమ్మాయి కూతురు, నాకు తోడుగా ఉంటుంది చింపిరి జట్టుతో తిరుగుతోందని హెయిర్ కట్ చేయించి తలస్నానం చేయించాను'' అంది ధర్మవతి నవ్వుతూ.

కడిగిన ముత్యంలా ఉన్న ఆ అమ్మాయిని చూసి నాకు ముచ్చటేసింది.

ఇంతలో కుక్క తోక ఊపుతూ నా దగ్గరకొచ్చింది. కుంటుతూ వచ్చిన ఆ కుక్కను చూసి జాలేసింది. వచ్చిన పని పూర్తి చెయ్యాలని ఆవిడతో మాట్లాడడానికి ఉపక్రమించాను.

''అమ్మా, మూడేళ్ళుగా ఏ సమస్యాలేదు. మీకుక్క రాజారావుగారిని కరవడంతో ఆయన పోలీసు కేసు వరకూ వెళ్ళేటట్టున్నాడు. అందుచేత తక్షణం మీకుక్కను పంపెయ్యండి, మునిసిపాల్టీ వారికి చెపితే వెంటనే పట్టుకు పోతారు'' అన్నాను.

“ఇప్పటికిప్పుడు పాపం దీన్ని ఎలా వదిలెయ్యను సార్... అసలేం జరిగిందంటే, రాత్రి ఇది అత్యవసరంగా బయటకు వెళ్ళవలసి వచ్చింది. నన్ను లేపడం ఇష్టంలేక నాకు తోడుగా ఉన్న ఈ పిల్లను లేపింది. తలుపు తీసేసరికి బైటకు పరిగెత్తింది. పాపం గేటు దగ్గర పోస్తుంటే. ఆ సమయంలో రాజారావు గారొచ్చారు. గేటుపక్కనే ఆయన కారు పార్క్ చేసి ఉంది. ఆయన తన కారును ఖరాబు చేస్తుందేమోనని రాయి విసిరారు. దాని కాలికి గట్టిగా దెబ్బ తగిలింది.

ఆ బాధలో ఈయన్ని కరిచింది. కుక్క కరిచినందుకు ఆయన భయ పడుతున్నారు. అలా భయపడటం సహజం. అయితే దీనికి యాంటీరేబిస్ ఇంజక్షన్లు పూర్తి కోర్సు చేయించాను. దీని ద్వారా ఆయనకు ఏ ప్రమాదమూ రాదు. అలాగే ఆయనను ఏంటీరేబిస్ ఇంజక్షను చేయించుకోమన్నాను. అందుకు అయ్యే ఖర్చు పూర్తిగా భరిస్తానని చెప్పాను.”

ఇంకా ధర్మవతి మాటలు పూర్తి కాకమునుపే, బైట పెద్ద స్వరం వినిపించింది. గుమ్మం ముందు నిలుచున్న రాజారావుగారు. ఆయన ముఖం ఎర్రగా అయిపోయింది. కళ్లు తీక్షణంగా ఉన్నాయి. నా వంక చూస్తూ...

“అయ్యా...

మీతో ఇక మాటలు లేవు, మొన్నటి నుంచి చెపుతున్నాను. ఇరవై నాలుగు గంటల్లోగా కుక్కను బయటకు వదలాలి. లేదా ఆవిడను ఇల్లయినా ఖాళీ చేయించండి లేకపోతే మీకు పోలీసు వారి నుంచి సమన్లు అందుతాయి. ఆ తర్వాత మీ ఇష్టం” ఆయన అరుచుకుంటూ అక్కడ నుంచి కదిలాడు.

నిర్లప్తంగా కుర్చీలో కూలబడ్డాను. మెదడు మొద్దుబారినట్టయింది.

“సార్ కాఫీ తాగండి” ఆవిడ కాఫీ కప్పుతో వచ్చింది. కాఫీ తాగుతూ చుట్టూ చూశాను. ఇల్లు పొందికగా సర్ది ఉంది. గోడ నుంచి వేళ్లాడుతున్న

పంజరంలో రంగురంగుల చిలుకలు! బయట కిటికీ లోంచి పాకిన సన్నజాతి పూల పరిమళం గది అంతా వ్యాపించింది. సెల్లార్‌లోని పావురాల ముందుకు ఆవిడ గింజల్ని విసిరింది. అవి ఆ గింజల్ని ఏరుకుతింటూ వింతవింత శబ్దాలు చేస్తున్నాయి. కాఫీ తాగడం పూర్తి చేసి ఆవిడ ముఖంలోకి చూశాను. రాజారావు గారు ఐదు నిమిషాల క్రితం సృష్టించిన అలజడి ఆవిడ ముఖంలో కనిపించ లేదు. చాలా ప్రశాంతంగా ఉంది. నిన్న రాత్రి నాకు కల కలిగించిన ఆందోళన మాయమయ్యింది.

"వస్తానమ్మా" అంటూ వెనక్కి తిరగకుండా ఆ ఇంట్లోంచి గబగబా బైటకు నడిచాను.

*　　*　　*

రెండు వారాల తర్వాత మా అపార్టుమెంటు ఆవరణలో ఎవరో స్వామీజీ ధార్మిక ఉపన్యాసం చెపుతున్నారంటే వెళ్ళాను. అపార్ట్‌మెంట్ సెల్లార్ క్రింద దాదాపు వందమంది శ్రోతలు ఆ ఉపన్యాసం వినడం కోసం కూర్చున్నారు.

నాకు ఎదురుగా నా అపార్టుమెంటు గుమ్మం ముందు టులెట్ బోర్డు నన్ను వెక్కిరిస్తూ కనిపించింది. రాజారావుగారు గొడవ చేసిన ఆరోజే ఇల్లు ఖాళీచేసేసింది ధర్మవతి.

అంత క్రితం పక్షులతో, పావురాలతో కళకళలాడుతూ కనిపించిన నా ఇల్లు ఇపుడు బోసిగా మూర్తీభవించిన శోకమూర్తిలా కనిపిస్తూ నాలో దిగులు పెంచుతోంది. మనసును నిలకడగా ఉంచుదామని ఆయన చెప్పేదానిపై దృష్టి సారించాను. ఆయన చెప్తున్న మాటలు విని ఒక్కసారిగా మనసులో అలజడి మొదలయ్యింది. అతికష్టంమీద ఐదు నిమిషాలు అక్కడ కూర్చుని, ఇక ఉండలేక గబగబా బైటికొచ్చాను. రోడ్డు మీదకొచ్చి భాస్కరానికి ఫోన్ చేశాను.

"క్షమించు భాస్కరం, పొరపాటు చేశాను" అన్నాను.

"నీ తప్పేముంది? ధర్మవతి తనను మోసం చేసిన భర్తను వదిలేసింది. పట్టించుకోని పిల్లల్ని వదిలేసింది. మరి తనను అంటిపెట్టుకొనే ఉన్న కుక్కను వదల్లేకపోయింది. అందుకే మీ ఇల్లే వదిలేసింది. ఒంటరి స్త్రీ, ఆవిడతో ఒక కుక్క కొన్ని పక్షులు, పావురాళ్లు, ఇల్లు అద్దెకు ఎవరిస్తారు? అయినా ఇచ్చారు. ఆమెను అమితంగా ప్రేమిస్తున్న ఆ లేబర్ కాలనీ వారు ధర్మవతి కోసం ఎవరో రెండు గదుల ఇల్లు ఖాళీ చేసి మరీ ఇచ్చారు" అంటూ భాష్కరం ఫోన్ పెట్టేశాడు.

అతడి మాటలతో నా మనసు మనసులో లేదు. ధర్మవతిని వెంటనే చూడాలి. క్షమించమని అడగాలి. గబగబా నడుస్తున్నాను. ఇందాక ధార్మిక విధుల గురించి ఉపన్యసిస్తూ గురువుగారు చెప్పిన కథ గుర్తుకొచ్చింది.

పాండవుల మహాభినిష్క్రమణలో ఒక కుక్క వారిని వెంబడించింది. ద్రౌపదితో సహా మిగతా నలుగురు పాండవులూ పడిపోయిన తర్వాతా, ఆ కుక్క ధర్మరాజును వదలకుండా అనుసరించింది. ఆ సమయంలో రథం తీసుకు వచ్చిన ఇంద్రుడు ధర్మరాజును స్వర్గానికి ఆహ్వానిస్తాడు. తనతో పాటూ తోడుగా వచ్చిన కుక్కను స్వర్గానికి తీసుకువెళ్ళేందుకు అనుమతి ఇస్తేనే రథం ఎక్కుతానంటాడు ధర్మరాజు. తనను ఆశ్రయించిన ఆ మూగ జీవిని మార్గమధ్యంలో వదలకుండా తన వెంట తీసుకుపోవాలనే ధర్మనిరతి, ధర్మరాజును సార్థక నామధేయుడిగా చరిత్రలో మిగిలిపోయేట్టు చేసింది.

ఆ కథ గురించి ఆలోచిస్తూ ఆ లేబర్ కాలనీలో అడుగుపెట్టాను. ఆ ప్రాంతమంతా సందడి సందడిగా ఉంది. తత్వాలు పాడుతున్న బైరాగులు, బట్టలు ఉతుకుతున్న మహిళలు, ఆడుకుంటున్న పిల్లలు వీరందరితో పాటు కలివిడిగా తిరుగుతున్న అనేకరకాల జంతువులు, కాలనీ మధ్యగా ఉన్న చెట్టుక్రింద నేను వెతుకుతున్న వ్యక్తి కనిపించింది. ఆవిడ పక్కనే కుంటుతూ నడుస్తున్న కుక్క.

నా కెందుకో రాత్రి కల మళ్లీ గుర్తుకొచ్చింది. 'కల అనేది రేపటి ప్రశ్నకు, నేటి సమాధానం.'

ఎవరో కల గురించి చెప్పిన నిర్వచనం మదిలో మెదిలింది.

నా శరీరంలో ఒక్కసారిగా గగుర్పాటు గుండెవేగంగా కొట్టుకుంది.

భవిష్యత్తులో జరగబోయేది అదేనా! నాలో, నేను ప్రశ్నించుకుంటే ఆశ్చర్యం, భయం.

నా ముందు నుంచున్న ధర్మవతికీ, ఆమె పక్కనే ఉన్న ఆకుక్కకూ, రెండు చేతులూ జోడించి తలవంచాను.

'ధర్మ దేవతకు అందరూ తలవంచాల్సిందే!' అలా అనుకుంటూ ముందుకు కదిలాను.

(ఆశ మాస పత్రిక 24-9-2012 రంజని-నందివాడ భీమారావు కథల పోటీలో బహుమతి)